# 27

# దేవుని క్రమశిక్షణ

## (12:4-11)

హెబ్రీ పత్రిక ఎవరికి వ్రాయబడిందో వారు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు (10:32-34) మరియు వారు తమ విశ్వాసాన్ని విడిచిపెట్టే యోచనలోనున్నారు. ఈ పాఠము యొక్క వాక్య భాగములో, వారు తమ కష్టాలను దైవిక కోణం నుండి ఎలా చూడాలన్న విషయాన్ని గ్రంథకర్త చెప్తున్నాడు. మొదటిగా, యేసు అనుభవించిన శ్రమలతో పోల్చితే వారి కష్టాలు కష్టాలే కాదని అతడు వివరిస్తున్నాడు (4 వ.). రెండవదిగా, ఒక ముఖ్యమైన విషయాన్ని చెప్పడానికి అతడు పాత నిబంధన నుండి ఒక వాక్య భాగమును ఉదహరిస్తున్నాడు (5, 6 వచనాలు; చూడు యోబు 5:17; సామెతలు 3:11, 12). దేవుడు తాను ప్రేమిస్తున్నవారిని శిక్షిస్తాడు. ఈ పాఠములో మనం ప్రభుని క్రమశిక్షణ గురించి నేర్చుకుంటున్నాము. ఇది అంత తేలికైన అంశము కాదు కానీ, ఇందులోని లోతైన విషయాలను బట్టి దీన్ని తప్పక అధ్యయనం చేయాలి. దేవుని క్రమశిక్షణ అంటే *ఏమిటి?* దేవుడు *ఎందుకు* జనులను క్రమశిక్షణలో నుంచుతాడు, ఆయన శిక్షణకు మనం *ఎలా* ప్రతిస్పందించాలి అన్న విషయమై మనం లేఖనాలను పరిశోధించుదాము.

### ఇది ఏమిటి?

ఈ లోక సంబంధ తండ్రులు పరలోక తండ్రితో పోల్చబడడం మనకు 12:4-11లో కనబడుతుంది. కొన్ని సమయాల్లో, ఈ లోక సంబంధ తండ్రులు మనలను శిక్షణ చేసే విధానం దేవుని క్రమశిక్షణ వలె ఉంటుంది. మరికొన్ని సమయాల్లో ఇది విభిన్నంగా ఉంటుంది.

#### ఈ లోక సంబంధ తండ్రులు

తండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో ఉంచాలన్న విషయం పాత మరియు క్రొత్త నిబంధనలోనూ కనబడుతుంది (సామెతలు 13:1; 19:18; ఎఫెసీయులకు 6:4). "క్రమ శిక్షణ" అను పదం యొక్క మూల పదం (*paideia*) "బాలుడు" (*pais*) అను పదము యొక్క క్రియారూపకమునుండే వచ్చినది. అనగా "పిల్లలను క్రమశిక్షణలో నుంచడం" అని అర్థం.[1] పిల్లలను ఎలా పెంచాలి అన్నది ఇది సూచిస్తుంది. వారిని "కృపతోనూ, దండనతోనూ" పెంచడమును ఇది సూచిస్తుంది.

ప్రాథమికంగా, క్రమశిక్షణలో నిరోధించడం, సరిదిద్దడం అను రెండు రకాలున్నాయి. నిరోధించే క్రమశిక్షణ అంటే పేరులో ఉన్నట్లుగానే పిల్లలు తప్పు చేయకుండా ముందుగానే నిరోధించేలా చూడడం. ఇందులో బోధించడం, హెచ్చరించడం ఉంటాయి. ఇందులో భాగంగానే పిల్లవాడికి కొన్ని పనులు యిచ్చి వాటిని అతని సామర్థ్యమునకు తగినట్లుగా పూర్తి చేయగల్గునట్లు చూడడం కూడా ఒక భాగం. (నేను ఒక మంచి వ్యక్తిగా ఎదుగడానికి మా నాన్నగారు నన్ను ప్రోత్సహించిన విధానం నాకు గుర్తుకు వస్తుంది. నాకు ఎప్పుడూ

అర్థవంతమైన పనులనే అప్పగించేవారు, నేను పెరుగుతున్న కొద్ది నాకు పెద్ద పనులను ఆయన అప్పగించేవారు.)

సరిదిద్దే క్రమశిక్షణ అనేది ఒక పిల్లవాడు తప్పు చేసిన తర్వాత జరిగేది. ఇందులో, ఆ పిల్లవాడు చేసిన తప్పులకు ప్రతిఫలమును అనుభవించడం, శిక్ష అనేవి ఉంటాయి. (నేను ఎదుగుచున్నప్పుడు కొన్ని సమయాల్లో ఇది కూడ నాకు అవసరమైయింది.)

**పరలోక తండ్రీ**

దేవుని క్రమశిక్షణలో నిరోధించడం మరియు సరిదిద్దడం రెండూ ఉంటాయి. యూదా క్రైస్తవులకు ఈ సత్యం విషయంలో అరణ్యములో తమ పితరులు ఎదుర్కొన్న బాధలు ఒక గొప్ప మాదిరిగా గుర్తుకు వస్తుంటాయి. సీనాయి పర్వతం వద్ద దేవుని శక్తిని ఇశ్రాయేలీయులు చూచినప్పుడు అది నిరోధించే క్రమశిక్షణ (చూడు ద్వితీయోపదేశకాండము 4:36). అరణ్యంలో నలభైయేళ్ళు తిరుగడం అనేది సరిదిద్దే క్రమశిక్షణ (చూడు ద్వితీయోపదేశకాండము 8:2-5).[2] ఇశ్రాయేలీయుల క్షేమం నిమిత్తం రెండు విధాల క్రమశిక్షణ అవసరమైంది.

దేవుని నిరోధాత్మక మరియు సరిదిద్దే క్రమశిక్షణ మనకు వాక్యంమీదే లభిస్తుంది (చూడు సామెతలు 6:23). దైవావేశిత వాక్యం ఏది మంచిదో ఏది చెడ్డదో చెప్తుంది. మనం ఎదగడానికి, వృద్ధి అగుటకు మనకు కొన్ని బాధ్యతలను ఆయన తన వాక్యంలో ఉంచాడు. మనం విఫలమైనప్పుడు వాక్యం మనలను హెచ్చరిస్తుంది. లెక్క ప్రకారం, మనం విధేయత చూపించకపోతే అందుకు తగిన పర్యవసానాలను మనం తప్పక అనుభవించాలి.

వాక్య భాగంలో ఇక్కడ ఇయ్యబడిన ప్రత్యేక క్రమశిక్షణలో పత్రిక అసలు పాఠకులు ఎదుర్కొంటున్న కష్టాలు వారిని దుఃఖకరముగా చేసిన (11 వ.) వారి శ్రమలు కూడ ఒక భాగం. వారు క్రైస్తవులయినప్పటి నుండి వారు ఎదుర్కొన్న సమస్యలన్నియూ ఇందులోని భాగం. ఇందులో హింసకూడ ఒక భాగం (4ఎ వ.). “అంటే దేవుడు మనలను క్రమశిక్షణ లోనుంచడానికి ఆయన మనలను హింసకు అనుమతిస్తాడా?” అని ఒకరు అడగవచ్చు. కాదు, కానీ కొన్నిసార్లు మనలను శిక్షణపరిచే క్రమంలో మనకు కష్టాలను ఆయన *అనుమతిస్తాడు.*[3] (ఇది కష్టతర అంశం అని ఇదివరకే చెప్పాను!)

ఈ విషయాన్ని కూడ నేను పేర్కొనాలి: మనకు ఏదయినా చెడు జరిగినప్పుడు మనకు తెలియనిది మరొకటి మనకు ఉంటుంది. ఒకవేళ అది మన స్వక్రియల పర్యవసానం కానట్లయితే దేవుడు దాన్ని కల్పించాడో లేక సాతానుడు దానిని జరుగనిచ్చాడో లేక అది పాప భూయిష్టమైన ప్రపంచం యొక్క దుష్ట జీవనం యొక్క ఫలితమో చెప్పలేము. ఒక విధంగా దేవుడు ఇందులో కలుగజేసుకుంటే, ఆయన ఉద్దేశం ఏమిటో మనకు తెలియదు (యెషయా 55:8, 9) – మనకు చెప్పింది ఒక్కటే! దేవుడు సమ్తమును మన మేలుకొరకే జరుగనిస్తాడు.

ఇదిగాక, మనం తెలుసుకొనదగ్గ సత్యాలు ఎన్నో ఉన్నాయి. మనకు ఏది సంభవించినా గాని, అందులోనుండి దేవుడు మనకు మేలునే దయచేస్తాడు (రోమీయులకు 8:28). దేవుని సహాయంతో మనము ఆ శోధనను జయించగలమని గుర్తించండి (హెబ్రీయులకు 13:5బి, 6).[4] అయితే ఇందులో మనం గ్రహించదగ్గ సందేశమేమంటే, దేవుడు మనలను *ప్రేమిస్తున్నాడు* గనుక ఇది ఆయన జరుగనిచ్చాడు.

## దేవుడు ఎందుకు మనలను క్రమశిక్షణ చేస్తాడు?

క్రమ శిక్షణ యొక్క ఉద్దేశం ఏమిటి? దేవుడు మనలను క్రమశిక్షణలోనుంచుతాడు అన్న అంశం కొంతమందికి కష్టతరంగా ఉంటుంది. ఎందుకంటే, వారి దృష్టిలో దేవుడు తమకు ఏది కావాలో దాన్ని దయచేయువాడు మాత్రమే. కొంతమంది తమ లోకానుసార జీవిత విధానాన్ని సమర్థించుకోవడానికి "దేవుడు నన్ను *సంతోషంగా* ఉండమని చెప్పాడు కాబట్టి ఇంతే!" అని చెప్తుంటారు.

### ఈ లోక సంబంధ తండ్రులు

అనేకమంది ఈ లోక సంబంధ తండ్రులు తమ పిల్లలు సంతోషంగా ఉండాలనుకుంటారు – కానీ మంచి తండ్రులు మాత్రం తమ పిల్లల విషయంలో ఇంతకంటే ఎక్కువే కోరుకుంటారు. వారు మంచి వ్యక్తులుగా ఎదగాలని, ఉన్నత వ్యక్తులై బాధ్యతగల వారిగా ఉండాలని వారు కోరుకుంటారు. క్రైస్తవ తల్లిదండ్రులయితే, తమ సంతానం నమ్మకస్థులైన క్రైస్తవ విశ్వాసులుగా నుండాలని కోరుకుంటారు. తన పిల్లలను సరియైన క్రమశిక్షణలో పెంచిన తండ్రిని తన పిల్లలు ఎలా ఉండాలో ఆశించని వ్యక్తిగా కనబడతాడు. అతడు తన పిల్లలను ప్రేమిస్తున్నానని చెప్పినను, అతడు నిజానికి ప్రేమించడంలేదు.

మొదటి శతాబ్దంలో తండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో ఉంచడానికి ప్రత్యేక సమయాన్ని కేటాయించేవారని, అట్లు కేటాయించబడనివారు, శిక్షణనొందనివారు దుర్బీజలు అని 7 మరయు 8 వచనాలు స్పష్టం చేస్తున్నాయి. లెక్క ప్రకారం, ఆ రోజుల్లో శిక్షణనొందిన కుమారుడే తన తండ్రి ఆస్తికి న్యాయపర వారసుడు అవుతాడు. అటువంటి కుమారుడు ఎదిగి తన తండ్రి నమ్మకానికి సరైన న్యాయం చేయగలగడమే అతని తండ్రికి ముఖ్య విషయం.

ఈ లోక సంబంధిత తండ్రుల తప్పిదములు గురించి 10వ వచనంలో చెప్పబడింది. ఒక మంచి తండ్రి కూడ తనకు ఎంతవరకు మంచిదనిపిస్తే అంతవరకే క్రమ శిక్షణనందించగలడు. తన పిల్లల మంచిని మాత్రమే అతడు కోరుకుంటాడు; కానీ ఒక మానవ మాతృడిగా అతడూ తప్పులు చేస్తాడు. (నేను ఒక మంచి తండ్రిగా ఉండాలని ప్రయత్నించాను. కానీ నేను చేసిన అనేక తప్పిదములు నాకు తెలుసు. అలాగే నేను ఎరుగనివి కూడ ఉన్నాయని నాకు తెలుసు.) తన పరిధులను తప్పిస్తే, ఒక మంచి తండ్రి తన పిల్లలను "ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను పెంచుటకు" తన సామార్థ్యము చొప్పున ప్రయత్నిస్తాడు (ఎఫెసీయులకు 6:4).

### పరలోక తండ్రి

మనవంటి బలహీనత లేని తండ్రివైపు మన దృష్టిని ఉంచుదాము. దేవుడు ఎందుకు మనలను క్రమశిక్షణ చేస్తాడు? ఇందుకు మూడు కారణాలను 7 నుండి 11 వచనాలు తెలియజేస్తున్నాయి.

(1) ఆయన మనలను క్రమశిక్షణలో ఉంచుతాడు. ఎందుకంటే మనము ఆయన పిల్లలము (7 వ.). ఆయన మనలను శిక్షించకపోతే మనమాయన పిల్లలము కాదనే దాని అర్థం (8 వ.).[5] ఆయన పిల్లలముగా మనం ఆయన దైవిక ప్రేమ ప్రతీకం (6 వ.; చూడు సామెతలు 3:12; ప్రకటన 3:19). మనకు కష్టాలు, శ్రమలు వచ్చాయంటే, దేవుడు మనలను ప్రేమించడం లేదని,[6] మనలను ఆయన ద్వేషిస్తున్నాడని కొంతమంది నమ్ముతుంటారు.

అయితే దేవుని శిక్షణ అనేది మన యెడల ఆయన *ప్రేమ* వ్యక్తీకరణ అన్న సత్యాన్ని హెబ్రీ క్రైస్తవులూ, మనం నమ్మాలి.

(2) "మన మేలుకొరకే ఆయన మనలను శిక్షిస్తున్నాడు" (10 వ.). మనం *బలవంతులుగా* ఎదుగవలెనని ఆయన మనలను శిక్షిస్తున్నాడు. శిక్షణ ద్వారా మనం ఓర్పును నేర్చుకుంటాము (7 వ.). మనం *ఉత్తమమైన* వారిగా ఎదుగవలెనని ఆయన మనలను శిక్షిస్తున్నాడు: "... తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని" (10 వ.), అప్పుడు మనము "నీతి అను సమాధానకరమైన ఫలమును" పొందుతాము (11 వ.).

(3) మనం జీవము కలిగియుండాలని ఆయన కోరుకుంటున్నాడు (9బి వ.) – ఇక్కడ సమృద్ధియైన ఆత్మీయ జీవితం మరియు అక్కడ నిత్య జీవితమును కలిగియుండాలని ఆయన ఆశిస్తున్నాడు (చూడు యోహాను 10:10బి). "మనము తీర్పు పొందినయెడల లోకముతో పాటు మనకు శిక్షావిధి కలుగకుండునట్లు ప్రభువు చేత శిక్షింపబడుచున్నాము" (1 కొరింథీయులకు 11:32). మన జీవితములను గురించి దేవుని ప్రాథమిక ఉద్దేశం మనలనుసంతోషముగా నుంచడం కాదు గాని, మనలను పరలోకం నిమిత్తం సిద్ధపర్చడమే.[7]

## దీనికి మనం ఎలా ప్రతిస్పందించాలి?

దేవుని క్రమశిక్షణకు మనం ఎలా ప్రతిస్పందించాలి? ఇదే ప్రశ్నను మరోవిధంగా అడుగుతాను: మనం ఆశించనిది, కోరుకోనిది, ఎదురుచూడనిది మనకు ఎదురయినప్పుడు మన ప్రతిస్పందన ఎలా ఉండాలి?[8]

### ఈ లోక సంబంధ తండ్రులు

ఒక ప్రేమించే తండ్రి యొక్క శిక్షకు కుమారుని ప్రతిస్పందన ఎలా ఉంటుంది? తమను శిక్షించే తండ్రిని ఎక్కువ మంది పిల్లలు *గౌరవిస్తారని* 9వ వచనం చెప్తుంది.[9] పిల్లలు తమ తండ్రుల మాటలు వినాలని, వారి ఉపదేశమునకు చెవియొగ్గాలని, వారినుండి శిక్షను పొందాలని పాత నిబంధన బోధిస్తుంది (చూడు సామెతలు 13:1; 19:20). వారు ఒకవేళ అలా చేస్తే, తరువాత వారు ఎదిగినప్పుడు తండ్రి క్రమశిక్షణ యొక్క లాభం ఏమిటో వారు గ్రహించగలరు (హెబ్రీయులకు 12:11బి).

### పరలోకపు తండ్రి

ఈ లోక సంబంధ తండ్రులనే మనం ఇంతగా గౌరవిస్తుంటే, మన పరలోకపు తండ్రి యొక్క శిక్షణకు మనం ఇంకెంత గౌరవాన్ని ఇవ్వాలి (9 వ.)? తన పాఠకులు తమ కష్టాలయందు వాటిని ఆనందంగా ఆస్వాదించాలని (11ఏ వ.),[10] గ్రంథకర్త వ్రాయడం లేదు కానీ, మంచి వైఖరి కలిగియుండాలని ఆయన వ్రాస్తున్నాడు. శిక్షకు సరైన ప్రతిస్పందనను 5వ వచనంలో అతడు వ్రాస్తున్నాడు:

దేవుని శిక్ష గురించి వాక్యం చెప్తున్న (5ఏ వ.) విషయాన్ని *మర్చిపోకండి.* శ్రమలు మనలను చుట్టుముట్టినప్పుడు ఈ వాక్యంలోని సత్యాలను విస్మరించకండి:

1. దేవుడు మిమ్ములను ప్రేమిస్తున్నాడు.

2. శిక్ష అనేది మన కుమారత్వమునకు సాక్ష్యము.

3. మనకు జరిగినదంతయు మనలను మరింత ఉన్నతులుగా చేయడానికే.

"ప్రభువు చేయు *శిక్షను తృణీకరించకుము*" (5బి వ.). దీన్ని నిజాయితీగా అంగీకరించి దీనినుండి మీరు ఏం నేర్చుకోగలరో చూడండి.

అన్నిటికంటే ముఖ్యముగా, "ఆయన నిన్ను గద్దించినప్పుడు *విసుగకుము*" (5సి వ.). ఈ సమస్యలను సాకుగా చూపించి విశ్వాసాన్ని వదిలివేయకండి, ఆ సమస్యలనుండి స్ఫూర్తిపొంది ముందుకు సాగండి. క్రైస్తవులు "ఓర్పు" కలిగియుండునట్లు వారికి ప్రోత్సాహాన్ని అందించడమే ఈ పత్రిక ఉద్దేశం.

మనం శిక్షనొందినప్పుడు మనం లోబడడం నేర్చుకుంటాము లేదా ఎదురు తిరగడం నేర్చుకుంటాము. మనం నెమ్మదిగా ఉండగలం లేదా అల్లరిగా తయారవ్వగలము. మనకు ఎదుటి వారిపట్ల గౌరవం కలుగుతుంది లేదా ఆగ్రహం కలుగుతుంది. "ఆత్మలకు తండ్రియైన వానికి మరి ఎక్కువగా లోబడియుండడము" (9బి వ.). "నేర్పు" మరియు దానియందు "అభ్యాసము కలిగి" "నీతియను సమాధానకరమైన ఫలము పొందుటకు" (11 వ.). మనం ఈ పత్రిక ద్వారా సవాలు చేయబడుతున్నాము.

హెబ్రీ పత్రిక గురించి బోధిస్తూ Doug Martindale ఈలాగు చెప్తున్నాడు, "నీకు సమస్యలు వచ్చినప్పుడు, చేతులెత్తేసి, 'ఇది నాకు ఎందుకు జరిగింది?' అని అనకుండా, 'ఇది నన్ను ఎలా మంచి వ్యక్తిని చేస్తుంది?' అని చూడడం నేర్చుకో! నాకు ఏం జరిగినా, నేను బలవంతుడనగుటకేనని నీవు అనుకోవాలి."[11]

---

## ఉపదేశకులకు సూచనలు

మన జీవితంలో ఎదురయ్యే శ్రమలను గురించి చర్చను ఇవ్వడం హెబ్రీ గ్రంథకర్త ఉద్దేశం కాదు. అయితే క్రైస్తవ్యంనుండి తొలగిపోవడానికి సమస్యలు అనేవి కారణం కాదు అన్న సత్యాన్ని స్థాపించడమే అతని ఉద్దేశం. శ్రమలు, శోధనలు గురించిన లోతైన అధ్యయనం కోసం రోమీయులకు 5:3–5 మరియు యాకోబు 1:2–4 వాక్యభాగాన్ని చూడండి.

---

సూచనలు

[1]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 97. [2]చూడు ద్వితీయోపదేశకాండము 11:2, 5. [3]యోబును శోధించడానికి సాతానుకు దేవుడు అనుమతినిచ్చాడు (యోబు 1; 2). [4]మన శ్రమలలో మనం ఒంటరివారము కాము. శ్రమలలో ఓర్చుకునేంత వరకే వాటిని దేవుడు పరిమితం చేస్తాడు. వాటిని అనుభవించునంతగా మనకు ఆయన సహాయం చేస్తాడు (చూడు 1 కొరింథీయులకు 10:13). [5]మనం దేవుని పిల్లలమనుటకు ఆధారం మనం శ్రమలనొందడం కాదు; క్రైస్తవులు శ్రమలు, హింసలను ఎదుర్కోవాలని లేఖనాలు తెలియజేస్తున్నాయి (అపొస్తలుల కార్యములు 14:22; 2 తిమోతి 3:12). [6]యోబు విషయంలో ఇదే జరిగిందని అతని స్నేహితులు అభిప్రాయపడ్డారు. తన పాపాన్నే ఒప్పుకుంటే అంతా బాగుంటుందని వారు చెప్తూవచ్చారు. [7]మనం సంతోషంగా ఉండాలని దేవుడు కోరుకుంటాడు. తన పిల్లల జీవితాలు దుర్భలంగా ఉండాలని ఆయన కోరుకోడు. అయితే మనలను వృద్ధిచేసి పరలోకం నిమిత్తం మనలను సిద్ధ పర్చడంలో ఇది ఆయన రెండవ ఉద్దేశంగా ఉంటుంది. [8]మనకు ఏదైనా చెడు సంభవిస్తే, దానిలోనిది మనకు తెలియదు, కాబట్టి అటువంటి సందర్భాలలో మన బాధ్యత నెరిగి మనం నడుచుకోవాలి. [9]ఇందుకు కొన్ని మినహాయింపులున్నాయి. [10]"శోధనలలో పడునప్పుడు అది మహానందమని ఎంచుకొనుడి" అని యాకోబు వ్రాస్తున్నాడు (యాకోబు 1:2), కానీ ఆ శ్రమల అంతిమ పర్యవసానం గురించి

అతడు చెప్తున్నాడు (3, 4 వచనాలు). శోధనలు కొంతవరకు సంతోషించేవి కావని హెబ్రీ పత్రిక చెప్తుంది.

[11]Doug Martindale, class on Hebrews, Eastside church of Christ, Midwest City, Oklahoma, 2008.